

ష్ఠించినట్లు ఐతిహ్యం. ఈ దేవాలయాన్ని వేములవాడ చాళుక్య రాజు విక్రమాదిత్య యుద్ధమల్లుని మనుమడు మొదటి నరసింహుడు నిర్మించాడు. ఇతనికి రాజాదిత్య అనే బిరుదు ఉండేది. ఆ పేరుతోనే రాజరాజేశ్వర దేవాలయం అనే పేరు వచ్చింది. తమిళనాడును పరిపాలించే రాజరాజచోళుడి తండ్రి రెండవ పరాంతక సుందర చోళుడు రాష్ట్రకూటుల నుంచి తనను కాపాడమని పరమేశ్వరుడిని వేడుకుంటాడు. ఆ భక్తితోనే తన కుమారుడికి రాజరాజు అని నామకరణం చేస్తాడు. రాజరాజు కూడా రాజరాజేశ్వరుడి భక్తుడే. అంతలోనే, రాజరాజచోళుడి కొడుకు రాజేంద్ర చోళుడు ఈ ప్రాంతంపై దాడి చేసి.. రాజరాజేశ్వర ఆలయంలోని విగ్రహాన్ని పెకలించి తీసుకెళ్లి తన తండ్రికి కానుకగా ఇస్తాడు. ఆ స్వామిని ప్రతిష్ఠించడం కోసమే రాజరాజు తంజావూరులో బృహదీశ్వరాలయాన్ని నిర్మించాడని అంటారు. దేవాలయ నిర్మాణానికి చాళుక్యుల నుంచి కప్పంగా వసూలు చేసిన సొమ్మునే వినియోగించాడు. ఆ తర్వాత చాళుక్యులు రాజరాజేశ్వర ఆలయంలో పునఃప్రతిష్ఠించిన మూర్తికి, బృహదీశ్వరాలయంలోని శివలింగానికి అనేక పోలికలు కనిపిస్తాయి. ఆ సంఘటనతో కల్యాణి చాళుక్యులు, రాజ్య ప్రజలు తీవ్ర మనోవేదనకు గురయ్యారు. శివుడికి (బృహదీశ్వరుడు) దూరమైన ఒంటరి పార్వతిని (బృహదీశ్వరమ్మను) వారు చూడలేకపోయారు. పసుపుతో గౌరమ్మను చేసి, తొమ్మిదిరోజులు పువ్వులతో బతుకమ్మను పేర్చి, శివుడు లేని పార్వతి గురించి పాటలు పాడుతూ, పూజించి శివుడి దగ్గరికి వెళ్లిరమ్మంటూ నీళ్లలో వదులుతారు. అదే అనంతర కాలంలో తెలంగాణ ప్రజల బతుకమ్మ ఆచారంగా మారిందని ఓ విశ్లేషణ.

### అనగనగా.. ధర్మాంగదుడు

బతుకమ్మతో ముడిపడిన ఓ జానపద కథ బహుళ ప్రాచుర్యంలో ఉంది. దక్షిణ భారతదేశాన్ని పూర్వం ధర్మాంగదుడు అనే రాజు పాలించేవాడు. ఈయన భార్య సత్యవతీదేవి. వీరికి వందమంది కుమారులు జన్మించినా.. అందరూ చనిపోయారు. దీంతో సంతానం లేకుండా పోతుంది. ఆ ఆలూమగలు ఘోర తపస్సు చేసి, లక్ష్మీదేవిని తమ కూతురిగా పొందుతారు. ఆ బాలికను చూసి దేవతలు, మునులు చల్లగా బతకమని ఆశీర్వదిస్తారు. ఆమే బతుకమ్మగా ప్రాచుర్యం పొందింది. ఈ బాలికకు చిన్నతనం నుంచే అతీత శక్తులు ఉండేవి. అడిగిన వారందరికీ వరాలు ఇచ్చేది. సాక్షాత్తూ ఆ శ్రీమహావిష్ణువు చక్రాంకుడనే పేరుతో జన్మించి ధర్మాంగదుడి ఇంటికి ఇల్లరికం వస్తాడు. ఆ జంటకు అనేకమంది పుత్రికలు జన్మిస్తారు. ఆ కడుపుచల్లని తల్లిని పూజించి.. తమ పసుపుకుంకాలు కలకాలం ఉండాలని వేడుకుంటారు ముత్తయిదువలు. తమకు మంచి భర్తను ప్రసాదించమంటూ.. పసుపు ముద్దను చేసి, దానిని శ్రీ మహాలక్ష్మిగా, పార్వతీదేవిగా భావించి పువ్వులతో గోపురంగా పేర్చి పూజిస్తారు పడుచుపిల్లలు. వేములవాడ ప్రాంతానికి చెందిన నరసింహభట్టు కవి బతుకమ్మ ప్రాశస్త్యాన్ని చెబుతూ.. ఈ కథను పాటరూపంలో వివరించాడు.

**రామరామరామ ఉయ్యాలో**
**శ్రీరామరామ ఉయ్యాలో**
**శ్రీలక్ష్మిదేవియు ఉయ్యాలో**
**సృష్టిబతుకమ్మయ్యె ఉయ్యాలో**
**భరతుని దేశమున ఉయ్యాలో**
**ధర్మాంగదుడనురాజు ఉయ్యాలో**
**ఆరాజు భార్యయూ ఉయ్యాలో,**
**అతివ సత్యవతి ఉయ్యాలో**
**నూరు నోముల నోచి ఉయ్యాలో**
**నూరుమందిని కనియె ఉయ్యాలో**
**వారు శూరులయ్యా ఉయ్యాలో,**
**తరగని శోకమున ఉయ్యాలో**
**ఘన అడవులకు బాసి ఉయ్యాలో**
**దాయాదులను బాసి ఉయ్యాలో..**
**అంటూ సాగుతుందా పాట.**

మరొక జానపద కథ ప్రకారం.. పార్వతీదేవియే వాసవాంబిక. ఈమె వైశ్యుల కులదేవత. కుసుమ శ్రేష్ఠి, కుసుమాంబికల పుత్రిక. గొప్ప సౌందర్యవతి. ఆమెను చూసి విష్ణువర్ధన మహారాజు మోహిస్తాడు. వివాహం చేసుకోవాలని భావిస్తాడు. దానికి ఆమె తల్లిదండ్రులు నిరాకరిస్తారు. ఆమె కూడా రాజాజ్ఞను ధిక్కరించి.. అగ్నికి ఆహుతి అవుతుంది. ఆ ఆత్మ త్యాగాన్ని కొనియాడుతూ వైశ్యులు ఆమెను దేవతగా కొలుస్తారు. మళ్లీ బతకమని పూజిస్తారు. అదే బతుకమ్మ సంప్రదాయంగా మారి ఉండవచ్చని ఒక అభిప్రాయం.

### ముగ్గురమ్మల మూలపుటమ్మ

శ్రీచక్రోపాసన నుంచి ఈ పండుగ వచ్చిందని మరో కథనం. బతుకమ్మ శక్తిస్వరూపిణి, మానవాళికి ఆయురారోగ్యాలను జ్ఞాన, ఇచ్ఛా, క్రియా శక్తులను ప్రసాదించే తల్లి. కనుక ఈ శక్తిని శ్రీచక్ర రూపంలో కొలవడం సంప్రదాయంగా మారిందని అంటారు. లక్ష్మి, పార్వతి, సరస్వతి.. ఈ ముగ్గురమ్మల రూపమే బతుకమ్మ అని తెలంగాణ మహిళల బలమైన భావన. ఈ ముగ్గురినీ ఏకరూపంలో చూడటమే దేవీతత్వం. శక్తిని ఆరాధించడానికి, పూజించడానికి శరత్ రుతువు అనుకూలమైనదని చెబుతారు ఉపాసకులు. ఈ రుతువులో చంద్రుడు అమితంగా ప్రకాశిస్తాడు. చంద్రుడిని మనః కారకుడనీ అంటారు. మనసులో ఉద్భవించే అనుకూల, ప్రతికూల భావాలకు చంద్రుని కళలే కారణమని విశ్వసిస్తారు. కాబట్టే, ఆ చంద్రకళల రూపంలో విరాజిల్లే శక్తి స్వరూపాన్ని లలితాదేవిగా, పార్వతిగా, పరమేశ్వరిగా, శంభురాణిగా, శైలసుతగా, కాళికగా, శాకంబరిగా, శ్యామలాంబగా, బాలాత్రిపురసుందరిగా, బతుకమ్మగా భావించి.. ఆమెను ప్రకృతి ప్రతిరూపాలైన పుష్పాలతో అలంకరించి పూజించడం సంప్రదాయంగా స్థిరపడి ఉండవచ్చని అమ్మవారి ఉపాసకుల ఉవాచ. నిజమే, బతుకమ్మ సంప్రదాయంలో ప్రతీదీ ప్రతీకాత్మకమే.



### గిరిజన కథలు

గిరిజనులు తమ జీవితాలు బాగుండాలని, ఆరోగ్యవంతమైన సంతానం కలగాలని అమ్మతల్లిని మొక్కుకునే ఆనవాయితీ ద్రావిడ దేశంలో పురాతన కాలం నుంచీ ఉంది. అలా వేడుకునే వన దేవతలలో బతుకమ్మ ఒకరు. ఆమె వరంతో పిల్లలు బతికితే 'బతుకమ్మ', 'బతుకయ్య' అని పేర్లు పెట్టుకుంటారు. తమ పిల్లలను చల్లగా చూసినందుకు ఆ తల్లిని పూవులతో శిఖరంగా పేర్చి బతుకమ్మగా భావించి తొమ్మిది రోజులు పూజలు చేసి నైవేద్యాలు సమర్పించి, పూజానంతరం నీళ్లలో నిమజ్జనం చేస్తారు.

